అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
శనివారం 20 మే 2023



## పారిశుధ్య పనులన పరిశీలించిన

నవతెలంగాణ-వేమనపల్లి

ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు నీల్వాయి క్యాతనపల్లి గ్రామ పంచాయితీలను ఆకస్మిక తనిఖీ చేశారు. పారిశుధ్య పనులను చేపట్టి చెత్తను కంపోస్ట్ షెడ్‌కు తరలించాలని ఆదేశించారు. పారిశుధ్య కార్యక్రమంలో అలసత్వాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు. ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు. బృహత్ పల్లె ప్రకృతి వనం, వైకుంటదామం, కంపోస్ట్ షెడ్‌లను పరిశీలించారు. నీల్వాయి గ్రామ పంచాయతీ పరిధిలోని నిర్ణీత ప్రమాణాలు పాటించని చికెన్ షాపుకు రూ.2000 జరిమానా విధించారు. మొక్కలకు నీరు పోసి వాటిని సంరక్షించాలని ఆదేశించారు. పంచాయతి రాజ్ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయుటకు కషి చేయాలని కార్యదర్శులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మయ్య, మండల పంచాయతి అధికారి శ్రీపతి బాపు, సర్పంచ్ గాలి మధు, పంచాయతి కార్యదర్శులు అశోక్, జాఫర్ పాల్గొన్నారు.

## వేసవి జాగ్రత్తలపై అవగాహన సదస్సు

నవతెలంగాణ-మందమర్రి

మందమరి ఏరియాలోని కేకే ఓసీపీలో వేసవి కాలంలో వడదెబ్బ తగలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో సింగరేణి వైద్యాధికారి డాక్టర్ లోకనాథ్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులు ఎండలో ఎక్కువసేపు తిరగకూడదని, నీరు ఎక్కువ తీసుకోవాలని శరీరంలో నీటి శాతం తగ్గకుండా చూసుకోవాలని నిమ్మరసం పండ్ల రసాలు తాగాలని అన్నారు. ఆహారపు అలవాట్లలో మార్పులు చేసుకోవాలని ఎండలో వెళ్లేటప్పుడు తలకు టోపీ లేత రంగు కాటన్ దుస్తులు ధరించాలన్నారు. వేపుడు పదార్థాలు అస్సలు తినకూడదని మద్యపానం మాంసం తగ్గించాలని ముఖ్యంగా గుండె సంబంధిత వ్యాధులు ఉన్నవారు బీపీ ఉన్నవారు తగు జాగ్రత్తలు వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కేకే ఓసీపీ ఇన్‌ఛార్జి మేనేజర్ కుష్వా సంక్షేమ అధికారి సత్యనారాయణ, టీబీజీకేఎస్ ఫిట్ సెక్రటరీ యుగేందర్, ఏఐటీయూసీ ఫిట్ సెక్రెటరీ కుమారస్వామి పాల్గొన్నారు.

# పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాలను కొనసాగిద్దాం

- సీపీఎం రాష్ట్ర కమిటి సభ్యులు పైళ్ల ఆశయ్య



నవతెలంగాణ-జైపూర్

పేద ప్రజల తరపున నిరంతరం పోరాడిన ప్రజా నాయకుడు వీర తెలంగాణ సాయుద పోరాట యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాలను కొనసాగించాల్సిన అవసరముందని సీపీఎం రాష్ట్ర కమిటి సభ్యులు పైళ్ల ఆశయ్య పిలుపునిచ్చారు. చెన్నూర్ మండలం బావురావుపేట్ శివారుల్లో చేపట్టిన భూపోరాట కేంద్రం వద్ద శుక్రవారం పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్థంతిని నిర్వహించారు. సీపీఎం జిల్లా కమిటి సభ్యులు బోడంకి చందు అధ్యక్షతన ఏర్పాటు చేసిన వర్ధంతి సభలో ఆయన మాట్లాడారు. నిజాం నియంతృత్వం, దొరల దౌర్జన్యాల నుండి తెలంగాణ ప్రజలను విముక్తి చేయడానికి సాగిన వీర తెలంగాణ రైతాంగ పోరాటంలో కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య కీలక పాత్ర పోషించారని తెలిపారు. తన వాటాకు వచ్చిన భూమిని పేదలకు పంచిన గొప్ప వ్యక్తి పార్లమెంటు సభ్యుడిగా ఎన్నికయినా సాదాసీదా జీవితాన్ని గడిపిన సుందరయ్య పార్లమెంట్ భవనానికి సైకిల్ పైన వెళ్లారని గుర్తు చేసుకున్నారు. నెల్లూరు సీమలో పుట్టిన ఆయన తెలంగాణ బిడ్డల పక్షాన పోరాడిన వైనం ప్రాంత, కుల, మత విబేధాలు సృష్టించే విచ్ఛిన్నకర శక్తుల అసలైన నైజాన్ని ప్రజలు గుర్తించడానికి సహకరిస్తుందని తెలిపారు.సోషలిజం ఉదయించాలని కలలు కన్న మహనీయుడైన సుందరయ్య ఆశయాలు నేటి తరంలో కొనసాగాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కోటపల్లి మండలం కార్యదర్శి రవి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్, నాయకులు తాండ్ర అనిల్, భూపోరాట నాయకులు మణి, రేణుక, సంధ్య, సరిత, నవీన్, ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

**హాజీపూర్ :** పేద ప్రజల తరపున నిరంతరం పోరాడిన ప్రజానాయకుడు, వీర తెలంగాణ పోరాటయోధుడు పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాలను నేటి తరం కొనసాగించాలని ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ప్రజా సంఘాల ఐక్యవేదిక అధ్వర్యంలో సుందరయ్య 38వ వర్ధంతి సభ శుక్రవారం మంచిర్యాల సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించారు. నిజాము నియంతత్వం, దొరల దౌర్జన్యాల నుండి తెలంగాణ ప్రజలను విముక్తం చేయడానికి సాగిన వీర తెలంగాణ రైతాంగ పోరాటంలో పుచ్చలపల్లి సుందరయ్య కీలక పాత్ర నిర్వహించారని వక్తలు పేర్కొన్నారు. పార్లమెంటు సభ్యుడిగా ఎన్నికయినా.. సాదా సీదా జీవితాన్ని గడిపిన సుందరయ్య పార్లమెంటు భవనానికి సైకిల్ పైనే వెళ్లే వాడని వారు గుర్తు చేశారు. నెల్లూరు సీమలో పుట్టిన సుందరయ్య తెలంగాణ బిడ్డల పక్షాన పోరాడిన వైనం.. ప్రాంత, కుల, మత విభేదాలు సృష్టించే విచ్ఛిన్నకర శక్తుల అసలు నైజాన్ని ప్రజలు గుర్తించడానికి సహకరిస్తుందని వారు తెలిపారు. ఈ దేశంలో సోషలిజం ఉదయించాలని కలలు కన్న మహనీయుడు సుందరయ్య ఆశయాలను కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు గోమాస ప్రకాష్, సామాజిక న్యాయవేదిక కన్వీనర్ రంగు రాజేశం, ప్రజాసంఘాల నాయకులు ఎస్వీ నర్సింహారావు, జె.హన్మంతరెడ్డి, పీఎస్ గంగాధరాచారి, సీహెచ్.బిక్కయ్య, వేముల రాజేశం, బి.కుమార స్వామి పాల్గొన్నారు.

**జన్నారం :** పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతిని సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కనికరపు అశోక్ మాట్లాడుతూ పేద ప్రజల తరపున, వారి సమస్యల విముక్తికి నిరంతరము పోరాడిన గొప్ప నాయకుడని కొనయాడారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల సీనియర్ నాయకులు కూకటికారు బుచ్చయ్య, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు గుడ్ల రాజన్న, పర్ల కనకయ్య, పోతు రమేష్, ఓదెలు, టీఏజీఎస్ మండల నాయకులు ఎస్.కె అబ్దుల్లా పాల్గొన్నారు. తాండూర్ : పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతిని సీపీఐ(ఎం) నాయకులు శుక్రవారం తాండూర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ తాండూరు మండల కార్యదర్శి దాగంరాజారాం మాట్లాడుతూ పేద ప్రజల తరపున నిరంతరం పోరాడిన ప్రజానాయకుడని తెలిపారు. కార్యక్రమంలో కేవీపీఎస్ మండల అధ్యక్షుడు దుర్గం నాన్నయ్య, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు వేల్పుల శంకర్ పాల్గొన్నారు.


జన్నారంలో..


జన్నారంలో..

## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



నవతెలంగాణ-వేమనపల్లి

మండలంలోని క్యాతనపల్లి గ్రామంలో డీసీఎంఎస్ వరి కొనుగోలు కేంద్రాన్ని సర్పంచ్ ఆవులమారి దుర్గక్క ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు తాము పండించిన ధాన్యాన్ని దళారులకు అమ్మి నష్టపోవద్దని ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ధాన్యాన్ని అమ్మి ప్రభుత్వం నిర్దేశించిన మద్దతు ధరను పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో నీల్వాయి మాజీ సర్పంచ్ రుద్రభట్ల లక్ష్మీ నారాయణ మాజీ కోఆప్షన్ సభ్యులు హమీద్ ఖాన్, క్యాతనపల్లి మాజీ సర్పంచ్ బొద్దున శంకర్, మాజీ సర్పంచ్ గొంతు మేర టకిరే ఓల్లేష్, మండల ఉపాధ్యాక్షులు కుమ్మరి బాపు, ఆవులమారి పున్నం, దొబ్బల రాజేష్, సెంటర్ ఇంచార్జి గూడూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఉన్నత లక్ష్యాలలో ముందుకు సాగాలి

- విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకు సాగాలని అప్పుడే సమాజంలో గుర్తింపు వస్తుందని ఆసిఫాబాద్ ఎస్సై రమేష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రేమల గార్డెన్‌లో తుడుందెబ్బ ఆధ్వర్యంలో ఇంటర్మీడియట్ పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జిల్లా అధ్యక్షుడు కోట్నాక విజయ్ అధ్యక్షతన నిర్వహించిన ప్రతిభా పురస్కారాల కార్యక్రమానికి తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు బుర్స పోచయ్యతో కలిసి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియట్ దశ అత్యంత ముఖ్యమైనదని సరైన దారిని ఎంచుకోవాలన్నారు. లక్ష్యం ఉన్నతంగా ఉన్నప్పుడే విజయం సాధ్యమవుతుందన్నారు. సామాజిక మాధ్యమాలను ఎక్కువగా వాడకుండా అవసరమైన మేరకు వాడుతూ అనుకున్న లక్ష్యాలు సాధించాలన్నారు. పోచయ్య మాట్లాడుతూ విద్యతోనే గుర్తింపు వస్తుందని బాగా చదివి తల్లిదండ్రులకు పేరు తీసుకురావడంతో పాటు జాతి ఔనత్యానికి తోడ్పాటు అందించాలన్నారు. విద్యార్థులు తమకు తాముగా అభివృద్ధి చెంది ప్రాంతం జాతి అభివృద్ధిలో ముఖ్య పాత్ర పోషించాలన్నారు. కార్యక్రమంలో తుడుందెబ్బ జిల్లా ఉపాధ్యక్షుడు కోవ విజయ్, కాగజ్‌నగర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సంగీత, రాయిసెంటర్ జిల్లా గీతేదార్ కుడుమేత యశ్వంతరావు, నిర్వాహకులు చిలారి మురళి, ప్రకాష్, శ్రీనాథ్ పాల్గొన్నారు.

## 22న జిల్లా కేంద్రంలో ధర్నాను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కేజీబీవీ, యూఆర్ఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 22న కలెక్టరేట్ ముందు చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వైద్య శాంతికుమారి, ఇందూరావు కోరారు. శుక్రవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని అన్నారు. ప్రత్యేకాధికారులను ప్రిన్సిపాళ్లుగా, సీఆర్‌టీలను స్కూల్ అసిస్టెంట్‌లుగా, పీఈటీలను పీడీలుగా గుర్తిస్తూ వాటి బేసిక్‌ను ఇవ్వాలని అన్నారు. హాస్టల్ నిర్వహణ కోసం కేర్‌టేకర్‌ను నియమించాలని, సీఆర్‌టీలకు రాత్రి విధుల నుండి మినహాయింపు ఇవ్వాలని అన్నారు. పీఆర్‌సీ సిఫారసు చేసిన విధంగా కేజీబీవీ కాంట్రాక్టు ఉద్యోగులకు ప్రతీ ఏడాది రూ. 1000 ఇంక్రిమెంట్ ఇవ్వాలనే తదితర 21 డిమాండ్లతో ఈ ధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. ఉదయం తొమ్మిది గంటల నుండి నిర్వహించే ఒక రోజు ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. పోరాటాల ద్వారానే డిమాండ్లు సాధించుకోవచ్చనే విషయాన్ని గ్రహించి అన్ని కేజీబీవీ, యూఆర్ఎస్ టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగ, ఉపాధ్యాయులు హాజరు కావాలని కోరారు. ఈ సమావేశంలో మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మహిపాల్, శివానంద్ పాల్గొన్నారు.

## జూన్ 2న ఆన్‌లైన్ క్విజ్ పోటీలు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

హైదరాబాద్ యూత్ డిక్లరేషన్‌ను స్ఫూర్తిగా తీసుకొని తెలంగాణ యువశక్తిని మేల్కొపేందుకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జూన్ రెండున రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు రాజీవ్‌గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ జిల్లా కో ఆర్డినేటర్ దాసరి వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలలో పాల్గొని ప్రతిభ చూపిన వారికి ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గానికి మొదటి బహుమతిగా ల్యాప్‌టాప్, రెండో బహుమతిగా స్మార్ట్ ఫోన్, మూడో బహుమతిగా ట్యాబ్‌తో పాటు 40 ప్రోత్సాహక బహుమతులు అందిచనున్నారని తెలిపారు. జిల్లాలోని రెండు అసెంబ్లీ నియోజకవర్గాలలో 16 నుండి 35 ఏండ్ల లోపు వారు ఈ క్విజ్ పోటీలలో పాల్గొని తమ ప్రతిభ ప్రదర్శించాలని సూచించారు. మరిన్ని వివరాలకు 8142903456 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

## ట్రేడ్ లైసెన్స్‌లను రెన్యువల్ చేసుకోవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

మున్సిపల్ చట్టంలో వచ్చిన మార్పుల నేపథ్యంలో పట్టణ వ్యాపారస్తులు ట్రేడ్ లైసెన్స్‌లను రెన్యువల్ చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ శైలజ సూచించారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ పలు వివరాలను వెల్లడించారు. దుకాణాదారులు మార్చ్ 31లోపే ట్రేడ్ లైసెన్స్‌లను రెన్యువల్ చేసుకోవాలని అన్నారు. జూన్ 1 వరకు 25 శాతం అదనపు రుసుము చెల్లించుకోనే వెసులుబాటు ఉందని తెలిపారు. జూన్ తరువాత చెల్లిస్తే 50 శాతం రుసుం ఉంటుందని వెల్లడించారు. ఆన్‌లైన్ ద్వారా ట్రేడ్ లైసెన్స్ రుసుమును చెల్లించాలని సూచించారు. ప్రస్తుతం కొలతల ఆధారంగా ట్రేడ్ లైసెన్స్‌ను అందిస్తున్నామని పేర్కొన్నారు.

# మంచిర్యాలలో మహిళ దారుణ హత్య

- పట్టపగలే మున్సిపల్ కార్యాలయం ఎదుట కత్తులతో దాడి
- మూడెకరాల భూమి కోసం హతమార్చిన రెండో భర్త మధు..?

నవతెలంగాణ-హాజీపూర్

మంచిర్యాల జిల్లా కేంద్రంలో పట్టపగలు వివాహితను అత్యంత దారుణంగా హత్య చేశారు. ఒకే దీచక్ర వాహనంపై వచ్చిన దుండగులు కత్తులతో మహిళపై దాడి చేసి హెచ్చరిస్తూ వెళ్ళి పోయాయి. దీంతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. హత్య సంఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టడంతో ఈ ఘటన జిల్లాలో సంచలనం రెపింది. వివరాల్లోకి వెళితే.. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కోటిపల్లి మండలం వెంచపల్లి గ్రామానికి చెందిన జనగామ స్వప్న(26) గత కొంత కాలంగా జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్‌లో తన భర్త జనగామ రవితో కలిసి నివాసం ఉంటుంది. మృతురాలికి మూడు పెండ్లిళ్ల ఐనట్టు సమాచారం. మొదటి భర్త విద్యుత్ షాక్‌కు గురై ప్రాణాలు కోల్పోయాడు. దీంతో అదే గ్రామానికి చెందిన వేల్పుల మధుతో వివాహం జరిగింది. అతడు భార్యను పట్టించుకోకుండా పోవడంతో కుటుంబంలో వివాదాలు తలెత్తాయి. దింతో ఆమె మధు నుంచి విడాకులు తీసుకుంది. అనంతరం జనగామ రవి అనే వ్యక్తితో పెండ్లి చేసుకుని జిల్లా కేంద్రం లోని రాజీవ్ నగర్ లో ఉంటుంది.

**ఆస్తి కోసం హత్య చేసిన రెండవ భర్త..?**



మృతురాలు జనగామ స్వప్న రెండవ భర్త వేల్పుల మధుతో కలిసి ఉన్న సమయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన దళితులకు మూడెకరాల భూమి పథకం ద్వారా భూమి పొందింది. విడాకుల అనంతరం ఈ భూమిపై వాటా కోసం చాలాసార్లు గొడవ పెట్టుకున్నాడు. పెద్దల సమక్షంలో ఒక ఒప్పందం కుదుర్చుకున్నప్పటికీ గొడవ సద్దుమణిగిపోలేదు. ఈ క్రమంలో జిల్లా కేంద్రంలో పని నిమిత్తం మృతురాలి మాజీ భర్త బంధువుల అమ్మాయి రాజమణి ఫోన్ చేసి పిలువడంతో మంచిర్యాలకు వచ్చింది. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట నుంచి రోడ్డుపై వెళ్తున్న క్రమంలో ఒకే ద్విచక్ర వాహనంపై మృతురాలు మాజీ భర్త ముందు, అతని సోదరుడు రాజేష్, తండ్రి వెంకటితో కలిసి కత్తులతో దాడి చేసినట్లు స్థానికులు చెబుతున్నారు. సోషల్ మీడియాలో వచ్చిన విడియోల ద్వారా వారిని మృతురాలు కుటుంబ సభ్యులు గుర్తించినట్లు సమాచారం. మూడెకరాల భూమి కోసం ఈ హత్య చేసిఉంటారని మృతురాలి బంధువులు తెలిపారు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన మంచిర్యాల పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి భర్త జనగామ రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

# జిల్లాలోనూ టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ కలకలం

- అవుట్‌సోర్సింగ్ ఆపరేటర్‌ను అరెస్టు చేసిన సిట్ అధికారులు

నవతెలంగాణ-నార్నూర్

ఆదిలాబాద్ జిల్లాలోనూ టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ వ్యవహారం కలకలం రేపుతోంది. ఇది వరకే జిల్లాకు చెందిన ఓ అభ్యర్థిని విచారించిన సిట్ అధికారుల బృందం..తాజాగా నార్నూర్ మండల తహసీల్దార్ కార్యాలయంలో ధరణి ఆపరేటర్‌గా పనిచేస్తున్న రాజేష్‌ను అరెస్టు చేయడం చర్చనీయాంశమైంది. బుధవారమే సిట్ అధికారులు కార్యాలయానికి ఎలాంటి సమాచారం రాకుండా సదరు వ్యక్తిని అరెస్టు చేసి తీసుకెళ్లినట్లు తెలిసింది. ఈ ఘటన గురువారం అలస్యంగా వెలుగులోకి రావడంతో స్థానికంగా సర్వత్రా చర్చకు దారి తీసింది. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ ఘటనలో అనేక మందిని విచారించిన సిట్ అధికారులు రెండు రోజులుగా నార్నూర్ మండలంలో మకాం వేశారు. రాజేష్ వ్యవహార శైలిపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు తెలుస్తోంది. రాజేష్ టీఎస్‌పీఎస్సీ నిర్వహించిన జేఈ పరీక్ష రాసినట్లు తెలిసింది. తహసీల్దార్ ఆర్క మోతీరా తెలిపిన వివరాల ప్రకారం..

బుధవారం ముగ్గురు సిట్ అధికారులు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని రాజేష్‌ను తీసుకెళ్లినట్లు వివరించారు.స్థానిక పోలీసులకు కూడా ఎలాంటి సమాచారం ఇవ్వలేదని తెలిసింది.

## జన్మదినం రోజే హఠన్మరణం

- మృతదేహంతో చివరి జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జన్మదినం రోజే హఠన్మరణం చెందిన బాలుడికి చివరి సారిగా మృతదేహంతో జన్మదిన వేడుకలను నిర్వహించిన సంఘటన శుక్రవారం మండలంలోని బాబాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఈ సంఘటన గ్రామస్తులందరిని కంటతడి పెట్టించింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని బాబాపూర్ గ్రామానికి చెందిన చునార్కర్ గుణాంతరావు, లలిత దంపతుల చిన్న కుమారుడు సచిన్(15)గుండెపోటుతో మరణించగా శుక్రవారం ఆయన పుట్టినరోజు కావడంతో చివరిసారిగా తల్లిదండ్రులు మృతుడి చేతితో కేక్ కట్ చేయించారు. సచిన్ స్థానిక సెయింట్ మేరీ పాఠశాలల్లో పదో తరగతి పూర్తి చేసి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాడు. గురువారం కడుపునొప్పి అనడంతో స్థానికంగా ఆస్పత్రికి తీసుకువచ్చి పరీక్షలు అవసరమైన మందులు వేసుకున్నప్పటికీ వాంతులు తగ్గకపోవడంతో మంచిర్యాలకు చికిత్స నిమిత్తం తీసుకుపోతుండగా మరణించాడు. ఘనంగా జన్మదినోత్సవం చేయాల్సిన రోజు కుమారుడు మరణించడంతో జీర్ణించుకోలేకపోయిన తల్లిదండ్రులు జన్మదిన వేడుకలు నిర్వహించడంతో తల్లిదండ్రులతో పాటు గ్రామస్తులు కన్నీటి పర్యంతమయ్యారు.

## రిమ్స్‌ను ఆకస్మికంగా తనిఖీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



వేసవి కాలం దృష్ట్యా రిమ్స్‌కి వచ్చే రోగులకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. శుక్రవారం సాయంత్రం రిమ్స్‌ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మొదటి అంతస్తులోని ఆర్ఓ ప్లాంట్, రెండు, మూడవ అంతస్తులలోని ఫ్రీజ్‌ల ద్వారా అందిస్తున్న తాగునీటి వసతులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రిమ్స్‌కి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని అన్నారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో ఆర్ఓ ప్లాంట్‌ను వెంటనే ఏర్పాట్లు చేయాలనీ సూచించారు. అలాగే రిమ్స్ ప్రాంగణంలో నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని అన్నారు. పారిశుధ్య పనులు కొనసాగేలా చర్యలు తీసుకోవాలని రిమ్స్ డైరెక్టర్‌ను ఆదేశించారు. ఈ పరిశీలనలో రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, వైద్య అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## దాతలు ముందుకు వచ్చి రక్తదానం చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పేదలు నిస్సాహయ పరిస్థితుల్లో ఉన్నవారికి రక్తదానం చేయడం గొప్పదని, రక్తదాతలే ప్రాణదాతలని రిమ్స్ డైరెక్టర్ రాథోడ్ జైసింగ్ రాథోడ్ అన్నారు. శుక్రవారం రిమ్స్ బ్లడ్ బ్యాంకులో స్మైల్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రిమ్స్ బ్లడ్ బ్యాంకులో ప్రస్తుత పరిస్థితుల్లో రక్తనిధి కొరత ఉన్నదని గ్రహించిన స్మైల్ సొసైటీ వారు తక్షణం స్పందించి రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి దాదాపు 20 మంది సొసైటీ సభ్యులు రక్తదానం చేయడం అభినందనీయమని అన్నారు. రక్తదానం చేయడానికి అందరూ ముందుకు రావాలని అన్నారు. గ్రామాలు, పట్టణ యువత సొసైటీని ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు కేమ శ్రీకాంత్, భూరె సురేష్, రవికాంత్ యాదవ్, సాయిగౌడ్ రామకృష్ణ, విశాల్, వెంకటేష్, రవి, పాండురంగ్, విక్రమ్ పాల్గొన్నారు.

## తీవ్ర ఎండల దృష్ట్యా ప్రజలకు బటర్ మిల్క్ పంపిణీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ జిల్లాలో రోజు రోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలకు ప్రజలు రోడ్లపై వచ్చేందుకు జంకుతున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ఆదిత్య ఖండేష్కర్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం చిరు వ్యాపారులకు, బాట సారులకు, బటర్ మిల్క్ పంపిణీ కార్యక్రమాన్ని పట్టణంలోని అంబేద్కర్ చౌక్‌లో చేపట్టారు. వాహనంలో ప్రత్యేక ఫ్రిజ్‌లో ఉంచిన చల్లని బటర్ మిల్క్‌లను ప్రజలకు అందించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే జోగు రామన్న ముఖ్యఅతిథిగా హాజరై ప్రజలకు బటర్ మిల్క్‌లను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లాలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలను దృష్టిలో పెట్టుకొని స్వచ్ఛంద సంస్థలు ఇలాంటి కార్యక్రమాలు చేయడం అభినందనీయం అన్నారు.

## ఆశా కార్యకర్తపై దాడిని నిరసిస్తూ పీహెచ్‌సీ ఎదుట ధర్నా



నవతెలంగాణ-జన్నారం

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న ఆశా కార్యకర్త భీంబాయిని అకారణంగా చితకబాది కులం పేరుతో దూషించటాన్ని నిరసిస్తూ శుక్రవారం ఆరోగ్య కేంద్రం ఎదుట ఆశా కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ధర్నా నిర్వహించడంతో అక్కడికి స్థానిక పోలీసులు చేరుకున్నారు జరిగిన సంఘటనను అడిగి తెలుసుకున్నారు, ఇదే ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న ఏఎన్ఎం పద్మ ఆమె భర్త శ్రీనివాస్‌తో పాటు మరో ఇద్దరు ఏఎన్ఎం లైన మాధవి కల్పన ఆశ వర్కర్ భీంభాయిని కులం పేరుతో దూషిస్తూ చితకబాదారు. ఈ విషయాన్ని స్థానిక వైద్యాధికారి ఉమాశ్రీ దృష్టికి తీసుకెళ్లారు. సమస్య కొలిక్కి రాకపోవడంతో ధర్నాకు ఉపక్రమించారు. భర్త శ్రీనివాస్ క్షమాపణ చెప్పడంతోపాటు ఏఎన్ఎం పద్మను సస్పెండ్ చేయాలని ఆశ వర్కర్లు డిమాండ్ చేశారు, స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఎస్సై పోచంపల్లి సతీష్ ఏఎన్ఎం పద్మతో పాటు ఆమె భర్త శ్రీనివాస్ మరో ఇద్దరు ఏఎన్ఎంల పై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

## రిమ్స్‌లో సామూహిక సహపంక్తి భోజనం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

భారత కార్మిక ఉద్యమ యోధుడు స్వాతంత్రోద్యమ పోరాట వీరుడు కమ్యూనిస్టు గాంధీ పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతిని పురస్కరించుకొని సీఐటీయూ రిమ్స్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం సామూహిక సహపంక్తి భోజనాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని రిమ్స్ డైరెక్టర్ రాథోడ్ జైసింగ్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నమొల్ల కిరణ్, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ మాట్లాడుతూ భారతదేశంలో అనేక కార్మికోద్యమాలను ప్రజా పోరాటాలను నిర్మించిన కార్మిక వర్గ పక్షపాతి సుందరయ్యని అన్నారు. కార్మికులు, ప్రజలు, కర్షకులు స్ఫూర్తిగా తీసుకొని హక్కుల సాధన కోసం పోరాటాలు నిర్వహించాలని అన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ కార్మిక హక్కులను కాలరాస్తూ కార్మిక చట్టాల సవరణ చేసిందని అన్నారు. 4 లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందని అన్నారు. ఈ లేబర్ కోడ్‌లను రద్దు కోసం కార్మికుల ఐక్యంగా పోరాడాలని అన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న, నాయకులు పెరిక దేవిదాస్, పండుగ పోచ్చన్న, సుమన్ ప్రశాంత్, పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను కలిసిన నూతన మున్సిపల్ కమిషనర్

నవతెలంగాణ-ఖానాపూర్



ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖా నాయక్‌ను శుక్రవారం ఆమె నివాసంలో ఖానాపూర్ మున్సిపల్ కమిషనర్‌గా నూతనంగా బదిలీపై వచ్చిన మనోహర్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందచేశారు. వారి వెంట మున్సిపల్ ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-ఇంద్రవెల్లి



మండలంలోని ఈశ్వరనగర్ గ్రామానికి చెందిన ఉపాధ్యాయులు జాదవ్ భారత్, వసంత్‌ల మాతృమూర్తి మీనాబాయి ఇటీవల మరణించడంతో, వారి కుటుంబానికి శుక్రవారం ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ చైర్మెన్ జాదవ్ శ్రీ రామ్ నాయక్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు ధరణి రాజేష్‌లు పరామర్శించారు. తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. మృతురాలి పవిత్ర ఆత్మకు శాంతి కలుగాలని కోరారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని ధైర్యాన్ని ఇచ్చారు. పరామర్శించిన వారిలో ఉట్నూర్ వైస్ ఎంపీపీ దావులే బాలాజీ, లంబాడ జేఏసీ నాయకులు నారాయణ్, దేవిదాస్, అంజద్ ఖాన్ ఉన్నారు.

## బీఆర్ఎస్ కుటుంబ బలగాన్ని చాటేందుకే ఆత్మీయ సమ్మేళనం

- ఎమ్మెల్యే అజ్మీరా రేఖ శ్యామ్ నాయక్



నవతెలంగాణ-పెంబి

మండల కేంద్రంలో శుక్రవారం బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే అజ్మీరా రేఖ శ్యామ్ నాయక్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన అన్ని పథకాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయని అన్నారు. ప్రజలకు ప్రభుత్వ పథకాల గురించి వివరించాల్సిన అవసరముందని అన్నారు. రేపు ఓటు అడిగే హక్కు బీఆర్ఎస్‌కు తప్ప ఇతర పార్టీలకు లేదని అన్నారు. నేడు తెలంగాణ రాకుంటే పెంబి మండలం అయ్యేది కాదని అన్నారు. అనంతరం కార్యకర్తలకు స్వయంగా భోజనం వడ్డించి వారితో కొంత సమయం గడిపారు. ఈ కార్యక్రమంలో పెంబి మండల అధ్యక్షులు నరేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ శంకర్, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామ కమిటీ అధ్యక్షులు పాల్గొన్నారు.

## సదర్‌మాట్ రైతాంగానికి అన్యాయం

నవతెలంగాణ-ఖానాపూర్

వలస పాలకుల నిర్లక్ష్యం వల్లనే సదర్‌మాట్ రైతాంగానికి తీరని అన్యాయం జరుగుతోందని జెడ్పీటీసీ జానుబాయి అన్నారు. శుక్రవారం ఆమె స్థానిక సదర్‌మాట్ కెనాల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సదర్‌మాట్ ఆయకట్ట దిగువ ప్రాంతంలో ఉన్న రైతులకు సాగునీరు కష్టాలు తప్పడం లేదని అన్నారు. ఖానాపూర్ మండలం మెడంపల్లి గ్రామ పర్యటనలో భాగంగా అక్కడి మహిళల రైతులతో కలిసి మాట్లాడారు. వారి సమస్యలను తెలుసుకున్నారు. వలస పాలకుల నిర్లక్ష్యమే ఖానాపూర్ నియోజకవర్గం అభివృద్ధికి నోచుకోవడం లేదని అన్నారు. సదర్‌మాట్ ఆనకట్ట వద్ద నిర్మాణం చేపట్టకుండా మామడ మండలానికి తరలించడంతో మన ప్రాంతానికి అన్యాయం జరిగిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో స్థానిక మహిళ రైతులు ఉన్నారు.

## రైతులకు అవగాహన కార్యక్రమం

నవతెలంగాణ-బేల

మండలంలోని ఎనిమిది క్లస్టర్‌ల పరిధిలోని గ్రామాలైన అవాల్‌పూర్, సిర్సన్న, సాంగిడి, మాంగ్రూడ్, దహెగాం, చాంద్‌పెల్లి, సైద్‌పూర్, పోహర్ గ్రామాలలో శుక్రవారం రైతులకు వానాకాలం సీజన్ ప్రారంభమవుతున్న సందర్భంగా అవగాహన కార్యక్రమం వ్యవసాయ శాఖ బేల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ విస్తరణ అధికారులు రైతులకు సలహాలు, సూచనలు అందజేశారు. రైతులు పంటలో భాస్వరం వినియోగం సామర్థ్యం పెంచి, భాస్వరం ఎరువులపై ఖర్చును తగ్గించే భాస్వరాన్ని కరిగించే బ్యాక్టీరియా పీఎస్‌బి గురించి, దానిని ఉపయోగించే పద్ధతిని గురించి అవగాహన కల్పించారు. అలాగే అనుమతి లేని, కల్తీ విత్తనాలను గుర్తించడం, విత్తనాల ఎంపిక, విత్తన శుద్ధి, మొలక శాతం పరీక్షల గురించి, రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు ఉమర్, రాజు, నగేష్, సాయి, శశికాంత్, దీప్తి, కృష్ణవేణి పాల్గొన్నారు.

## సిరికొండకు పీహెచ్‌సీ మంజూరు



నవతెలంగాణ-సిరికొండ

సిరికొండ మండలానికి నూతన పీహెచ్‌సీ మంజూరు అయ్యింది. కొత్త మండలాల్లో నూతన పీహెచ్‌సీలు ఉండాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం 40 కొత్త ఆస్పత్రులను మంజూరు చేసింది. అందులో భాగంగా సిరికొండకు నూతన పీహెచ్‌సీ మంజూరు కావడం పట్ల మండల వాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మండలానికి పీహెచ్‌సీని మంజూరు చేయాలని స్థానిక ప్రజాప్రతినిధులు ప్రభుత్వానికి విన్నవించారు. ఈ పీహెచ్‌సీ మంజూరుకు కృషి చేసిన ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు, మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపు రావు, మాజీ మంత్రి గోడం నగేష్‌లకు మండల వాసులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తోకల చిన్న రాజన్న, మాజీ సర్పంచ్ పెంటన్న, నాయకులు లతీఫ్, అశోక్, రాజు, నర్సింలు, లక్ష్మణ్, ప్రకాష్, విజయ్ పాల్గొన్నారు.

## అంధుల వివాహానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-ఉట్నూర్

చూపులు లేకున్న వారి మనసులు ఒక్కటయ్యాయి. మండలంలోని ఎందా గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబం గుండాల ప్రకాష్, కవిత కుమారుడు గుండాల సునీల్(అంధుడు), మహారాష్ట్రకు చెందిన అంధురాలు రాణిని వివాహానికి స్థానిక సర్పంచ్ యశోద, ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ చైర్మెన్ శ్రీరామ్ జాధవ్ ఆధ్వర్యంలో వారికి వివాహ ఖర్చుల నిమిత్తం రూ.5వేల ఆర్థిక సాయంగా అందజేసి మానవత్వం చాటుకున్నారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ ఏ సహాయ సహకారాలు అవసరం ఉన్న నా దృష్టికి తీసుకురావాలని తెలియజేశారు. వారి వెంట వైస్ ఎంపీపీ దావులే బాలాజీ, లంబాడ జేసీ నాయకులు నారాయణ, బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షులు ధరణి రాజేష్, టీడీపీ రాష్ట్ర నాయకులు దేవిదాస్, సామాజిక కార్యకర్త అంజాద్ ఖాన్ ఉన్నారు.

# సుందరయ్య స్ఫూర్తితో ప్రజాస్వామ్య పరిరక్షణ

- సుందరయ్య 38వ వర్ధంతి సభలో సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ పిలుపు

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్



దేశంలో ప్రజాస్వామ్యాన్ని, భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి ప్రజలు సుందరయ్య స్ఫూర్తితో పోరాడాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ అన్నారు. శుక్రవారం స్థానిక సుందరయ్య భవనంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లంకా రాఘవులు అధ్యక్షతన జరిగిన పార్టీ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వతంత్ర పోరాటంలో పాల్గొన్న సుందరయ్య దేశంలో ప్రజాస్వామ్యం పరిఢవిల్లాలని ఆకాంక్షించేవారని అన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరికి ఆర్థిక, సామాజిక, రాజకీయ సమానత్వం రావాలని కోరుకునేవారనీ గుర్తు చేశారు. మొట్టమొదటి పార్లమెంట్ ప్రతిపక్ష నాయకుడుగా దేశాభివృద్ధికి అనేక రకాల ప్రయత్నాలు చేశారని కొనియాడారు. తొలినాటి నెహ్రూ ప్రభుత్వానికి అనేక సలహాలు, సూచనలు చేశారనీ వివరించారు. నెహ్రూ కూడా సుందరయ్యను అభిమానించే వాడని, అయన చేసిన సూచనలను స్వీకరించే వాడనీ గుర్తు చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కుతోందని మండిపడ్డారు. ప్రశ్నించిన మేధావులు, జర్నలిస్టులు, కవులు, కళాకారులు, ప్రతిపక్షాలను దేశద్రోహులుగా చిత్రీకరిస్తూ జైళ్లకు పంపుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వాన్ని విమర్శించిన వారిని దేశాన్ని విమర్శించినట్టుగా ముద్రవేస్తూ వేధింపులకు గురి చేస్తోందని అన్నారు. రాష్ట్రాల హక్కులను సైతం కేంద్రం తన గుప్పిట్లోకి తీసుకుని పెత్తనం చేస్తోందని ఆరోపించారు. మతం పేరుతో రాజకీయాలు చేస్తోందని అన్నారు. మతం, రాజకీయాలు వేరు వేరని భారత లౌకిక రాజ్యం తెలియజేస్తుంటే రాజకీయాల్లో మతాన్ని జొప్పించి రాజకీయ పబ్బం గడుపుకుంటూందని అసహనం వ్యక్తం చేశారు. భారత రాజ్యాంగా స్ఫూర్తిని కాపాడుకోవడానికి దేశ ప్రజలందరూ సుందరయ్య స్ఫూర్తితో పోరాడాలని సూచించారు. ఈ సందర్భంగా తమ పార్టీలో కొత్తగా చేరిన యువకులకు పార్టీ సభ్యత్వం కల్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) పార్టీ జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు లంక రాఘవులు, అన్నమొల్ల కిరణ్, జిల్లా కమిటీ సభ్యులు బొజ్జ ఆశన్న, ఎం.గంగన్న, బైరి సోమేశ్, నాయకులు లంక జమున, కే.లలిత, పోషక్క, ఎన్.స్వామి, కే.ఆశన్న పాల్గొన్నారు.

# ప్రతిపక్ష నాయకుల దుష్ప్రచారాలను ఎండగట్టాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌అర్బన్

బీఆర్ఎస్ పార్టీపై దుష్ప్రచారాలు చేస్తున్న ప్రతిపక్ష నాయకులను ఎక్కడికక్కడే ఎండగట్టాలని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఓ ప్రయివేట్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన పార్టీ ఆత్మీయ సమ్మేళనంలో 12 వార్డులకు సంబంధించిన పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బీసీ ఘననకు అనుమతి ఇవ్వకపోవడం ఆ పార్టీ మొండి వైఖరికి నిదర్శనమని అన్నారు. తమ ప్రభుత్వం హయాంలో బీసీ అభ్యున్నతికి రాజకీయంగా రిజర్వేషన్లు కల్పించి అనతికాలంలోనే దేశానికే దిక్సూచిగా నిలిచామని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఒంటెద్దు పోకడలు, స్థానిక ప్రతిపక్ష నాయకుల దుష్ప్రచారాలను ఎక్కడికక్కడే ఎండగట్టాలని కార్యకర్తలకు సూచించారు. క్షేత్రస్థాయిలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల తీరును వివరిస్తూ అత్యంత క్రియాశీలకంగా పని చేయాలనీ అన్నారు. దేశంలో ఎక్కడలేని విధంగా సీఎం కేసీఆర్ సంక్షేమాభివృద్ధి పథకాలను అమలు చేస్తున్నారని అన్నారు. ప్రతిపక్ష నాయకులు అనవసర దుష్ప్రచారాలు చేస్తూ రాజకీయ పబ్బం గడుపుకుంటున్నారని ఆరోపించారు. ప్రతిపక్షాల విష ప్రచారాలను క్షేత్రస్థాయిలో తిప్పి కొట్టాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందని సూచించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని ధ్వజమెత్తారు. తెలంగాణ ప్రభుత్వ పనితీరుపై అర్థవంతమైన చర్చ జరుపుతూ ప్రజలకు వివరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి, మున్సిపల్ చైర్మెన్ ప్రేమేందర్, గ్రంథాలయ సంస్థ చైర్మెన్ రౌత్ మనోహర్, మున్సిపల్ వైస్ చైర్మెన్ జహీర్ రంజాని, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు అలాల్ అజయ్, అష్రఫ్, మహిళా విభాగం అధ్యక్షా, ప్రధాన కార్యదర్శులు స్వరూప, మమత, కస్తాల ప్రేమల, సాజిదోద్దీన్, కోఆప్షన్ సభ్యులు ఏజాజ్, శ్రీనివాస్, దివిటి రాజు, జోగు మహేందర్ పాల్గొన్నారు.

# ప్రభుత్వ కళాశాలలోనే నాణ్యమైన విద్య




నవతెలంగాణ-నార్నూర్

ప్రయివేటు కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాలల్లో ఉచిత సదుపాయాలు కల్పిస్తూ విద్యాబోధన జరుగుతుందని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌ఛార్జి బాలాజీ కాంబ్లే అన్నారు. శుక్రవారం తాడిహత్నూర్ గ్రామంలో పదో తరగతి పాసైన విద్యార్థులకు అడ్మిషన్ డ్రైవ్ నిర్వహించారు. విద్యార్థులు పోషకులకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రవేశం పొందటకు తగు సూచనలు చేశారు. ప్రభుత్వ కళాశాలల్లో ఎలాంటి ప్రవేశ రుసుము లేకుండా ప్రవేశాలు పొందవచ్చని ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు స్కాలర్ షిప్ కూడా అందిస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వ కళాశాలలో అనుభవం గల అధ్యాపకులతో నాణ్యమైన విద్యాబోధన బోధిస్తారని అన్నారు. విద్యార్థులు పోషకులు ఆలోచించి, ప్రయివేటు యాజమాన్యానికి డబ్బులు పెట్టకుండా ప్రభుత్వ కళాశాలలో చేరీ ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలని కోరారు.

**కుభీర్ :** మండల కేంద్రమైన కుభీర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలోనే నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తామని కళాశాల ప్రిన్సిపాల్ శ్రీహరి అన్నారు. శుక్రవారం మండలంలోని గొడిసెరా, పాంగ్రా గ్రామంలో ఉన్న పదో తరగతి పాసైన విద్యార్థులకు ప్రభుత్వ కళాశాలలోనే నాణ్యమైన విద్యను అందిస్తున్నామని అన్నారు. దీంతో ప్రభుత్వ కళాశాలలో చేర్పించేందుకు గ్రామంలో ఉన్న విద్యార్థులను అడ్మిషన్ తీసుకోవాలని కోరారు. దీంతో కళాశాలలో ఉచిత విద్య పాఠ్యపుస్తకాలు ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. అదే విధంగా ప్రభుత్వ కళాశాలలు బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్క తల్లిదండ్రులు విద్యార్థులు కృషి చేయాలని అన్నారు. ప్రభుత్వ కళాశాలలో చదువుకునే విద్యార్థులకు అన్నిరకాల బైపీసీ, ఎంపీసీ, సీఈసీ, తదితర కోర్సులు తెలుగు, ఇంగ్లీష్ మీడియం కూడా ఏర్పాటు చేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో విజయ, భాస్కర్, నర్సయ్య, హనుమంతరావు, లింగయ్య, శివరాజ్ పాల్గొన్నారు.




## ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘ నాయకులకు టికెట్లు కేటాయించాలి

నవతెలంగాణ-నిర్మల్

తెలంగాణలో త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల నాయకులకు కొన్ని టికెట్లు కేటాయించాలని తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయ్స్ యూనియన్ నిర్మల్ జిల్లా అధ్యక్షులు కృష్ణారావు శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. టిక్కెట్లు ఇచ్చి ఉపాధ్యాయులకు ప్రజా సేవ చేసే అవకాశాన్ని కలిపించాలని పేర్కొన్నారు. టికెట్ ఇస్తే ఉద్యోగానికి రాజీనామా చేయడానికి సిద్ధమని తెలిపారు. రాష్ట్రంలో మూడు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గాలు ఉన్నాయని, మూడు నియోజకవర్గాలకు ఒకటి చొప్పున ఉపాధ్యాయులకు మూడు టికెట్లు కేటాయించాలని, కుదరని పక్షంలో కనీసం రెండు టికెట్లు అయినా ఉపాధ్యాయులకు కేటాయించాలని ఆయా రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బందితో సహా కలిపి ఎనిమిది లక్షలపైనే ఉంటారని తెలిపారు. వీరి కుటుంబ సభ్యుల ఓట్లతో కలిపి దాదాపు 50 లక్షల ఓట్ల పైనే ఉంటాయని తెలిపారు. రాష్ట్రంలో ఉన్న మూడు కోట్ల పైగా ఓట్లలో వీరి ఓట్లు ఇరవై శాతం ఉంటుందని తెలిపారు. ఏ పార్టీ అయితే టికెట్ ఇస్తుందో, అన్ని నియోజక వర్గాలలో ఆ పార్టీ అభ్యర్థులకు ఈ యాభై లక్షలకు పైగా ఓట్లను వేయించేల చొరవ తీసుకుంటామని హామీ ఇస్తున్నామని పేర్కొన్నారు. ఈ విషయమై త్వరలోనే తాము అన్ని పార్టీల రాష్ట్ర అధ్యక్షులను, అదిష్టానాలను కలిసి వినతిపత్రం ఇస్తామని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఎన్నికలలోపే సీపీఎస్ రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. పీఆర్సీ కమిటీ వేయాలని కోరారు. జులై ఒకటి నుండి నూతన వేతనాలు అందేలా చూడాలని కోరారు. పెండింగ్‌లోని అన్ని బిల్లులను తక్షణమే చెల్లించాలని కోరారు.

# క్విజ్ పోటీలను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాజీవ్ గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీలను నిర్వహిస్తున్నామని, యువత సద్వినియోగం చేసుకోవాలని డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో ఆన్‌లైన్ క్విజ్ పోటీల కరపత్రాలను ఆవిష్కరించారు. ఆన్‌లైన్ క్విజ్ పోటీలలో పాల్గొనేందుకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. లింక్ పొందడానికి 7661899899 నెంబరుకు మిస్డ్ కాల్ ఇవ్వాలని అన్నారు. 16 నుంచి 35 ఏండ్ల యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. జూన్ 2న ఈ పరీక్ష ఉంటుందన్నారు. సామజిక స్పృహ, తెలంగాణ రాష్ట్ర చరిత్ర, తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ భూమిక అనే అంశాలపై 60 ప్రశ్నలు 60నిమిషాలు సమయంలో ఉంటుందన్నారు. విజేతలకు బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు.



## కూలీలు జాగ్రత్తలు పాటించాలి



నవతెలంగాణ-నార్నూర్

ఉపాధి హామీలో భాగంగా పనులు చేస్తున్న కూలీలు ఎండలు సమీపిస్తున్న నేపథ్యంలో జాగ్రత్తలు పాటించాలనీ డీఆర్డీఓ కిషన్ ఉపాధి హామీ కూలీలకు సూచించారు. శుక్రవారం మండలంలోని బోప్పాపూర్ గ్రామంలో కూలీలు క్షేత్ర స్థాయిలో నిర్వహిస్తున్న పనులను పరిశీలించారు. మస్టర్‌లో పొందుపర్చిన కూలీల వివరాలు హాజరును తనిఖీ చేశారు. ఎండలు రోజు రోజుకు సమీపిస్తున్న తరుణంలో కూలీలు ఉదయాన్నే పనులు ముగించుకుని రావాలని ఎండలో పనులు చేయవద్దని సూచనలు చేశారు. వచ్చిన డబ్బులను సరిగా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వారి వెంట స్థానిక సర్పంచ్ కనక సెవంతా ప్రభాకర్, ఇన్‌ఛార్జి ఏపీఓ సురేందర్, టీఏ సచిన్ జాదవ్, ఎఫ్ఏ న్యానోబా, ధుత్ రాజ్ మధుకర్, విశ్వజిత్, శ్రీరంగ్ మెట్‌లు ఉన్నారు.

## వెద సాగుతో ఆర్థిక ప్రయోజనాలు అధికం



నవతెలంగాణ-పెంబి

వెద సాగు విధానంలో వరి పండించడం వల్ల సాగు ఖర్చులు గణనీయంగా తగ్గి రాబడి పెరుగుతుందని పెంబి వ్యవసాయ విస్తరణ అధికారులు గంగాజల, రాజ్ కుమార్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో రైతు నర్రా దేవేందర్‌రెడ్డి వెద పద్ధతిలో సాగు చేసిన వరిపోలంలో మండల రైతులకు క్షేత్ర సందర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఏఈఓ గంగాజల మాట్లాడుతూ వెద సాగు పద్ధతిలో వరి పండించటం వల్ల నారు పెంచే ఖర్చు, నాట్లు వేసే ఖర్చులు లేకపోవడం వల్ల ఎకరాకు సుమారుగా ఆరు వేల నుండి ఏడు వేల రూపాయలు రైతుకు ఆదా అవుతుందని తెలిపారు. అంతే కాకుండా వెద సాగులో పండించిన వరి నాటు వేసే పద్ధతిలో సాగు చేసిన పొలం కంటే సుమారుగా పది రోజులు ముందుగా కోతకు వస్తుందని తెలిపారు. రానున్న ఖరీఫ్‌లో మండల పరిధిలో రైతులు వెద పద్ధతిలో సాగు చేసుకునేలా రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెంబి మ్యాక్స్ చైర్మెన్ సల్ల రామేశ్వర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## 19వ సారి రక్తదానం చేసిన మడిగెల అనిల్




నవతెలంగాణ-ఖానాపూర్ రూరల్

పట్టణంలోని విద్యానగర్ కాలనీకి చెందిన మడిగెల అనిల్ కుమార్ 19వ సారి రక్తదానం చేసి తన ఉదారత చాటుకున్నారు. శుక్రవారం బైంసా పట్టణానికి చెందిన బాబా రెడ్డికి క్యాన్సర్ ఆపరేషన్ కోసం బి పాజిటివ్ రక్తం అవసరం ఉందన్న విషయాన్ని ప్రసారమాధ్యమాల్లో చూసిన అనిల్ వెంటనే స్పందించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి స్వచ్ఛందంగా రక్తదానం చేయడంతో నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రి ఆర్ఎంఓ డాక్టర్ వేణుగోపాలకృష్ణతో పాటు పలువురు అయనను అభినందించారు.

## జీవ వైవిధ్యంతోనే మానవుడి మనుగడ




నవతెలంగాణ-ఇంద్రవెల్లి

జీవవైవిధ్యంతోనే మానవ మనుగడకు అత్యంత అవసరమైనందున ప్రతిఒక్కరూ ప్రకృతి వనరుల పరిరక్షణకు కృషి చేయాలని జీవవైవిధ్య యాజమాన్య మండలి జిల్లా కోఆర్డినేటర్ సోన్ కాంబ్లే గోపీనాథ్ అన్నారు. శుక్రవారం మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ కోరెంగ గాంధారి సుంకట్‌రావు ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మానవ మనుగడకు జీవవైవిధ్యం అత్యంత ఆవశ్యకమైన ప్రకృతి ప్రసాదించిన జీవవైవిధ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. వైవిధ్యం కలిగిన అనేక జీవ, వృక్ష జాతులు కలిసి, మనుగడ సాగించడమే జీవవైవిధ్యం అన్నారు. ఆహారం, ఆరోగ్యం వంటి పలు రకాల అవసరాల కోసం మానవుడు జీవవైవిధ్యంపై ఆధారపడి మనుగడ సాగిస్తున్నారని అన్నారు. ఇందులో మండల ఎంపీఓ సంతోష్, పంచాయతీ ఈఓ సంజీవరావు, ఐకేపీ సీసీ బామ్నే శ్రీరామ్, అటవీశాఖ బీట్ ఆఫీసర్లు అరుణ్, రాజు, టీఏ సంజీవ్, ఆశ వర్కర్లు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## కేసీఆర్ చిత్రపటానికి వీఆర్ఏల పాలాభిషేకం

నవతెలంగాణ-తాండూర్



కేసీఆర్ వీఆర్ఏలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ మంత్రివర్గ సమావేశంలో వీఆర్ఏలకు బేసిక్ పే ప్రకటించడంతో వీఆర్ఏలు సంబరాలు జరుపుకున్నారు. శుక్రవారం మండల కేంద్రంలో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇచ్చిన హామీ ప్రకారం కేసీఆర్ 23 వేల మంది వీఆర్ఏల కుటుంబాలను ఆదుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఇప్ప విజయ్ కుమార్ మండల ఉపాధ్యక్షుడు అలిశాల అంజలి, ప్రధాన కార్యదర్శి, కోశాధికారి గజ్జెల్లి తిరుపతి, గౌరవ అధ్యక్షుడు రెవెళ్లి దిగంబర్, జిల్లా కోకన్వీనర్ పిట్ట వేణు, కొర్రీ సదయ్య, ఇప్ప శ్రీకాంత్, గొర్లపల్లి అజయ్ కుమార్, మండిగ భాగ్య పుదరి కేతమ్మ పాల్గొన్నారు

## మండలంలో కనీస వసతులు లేని ఐకేపీ కేంద్రం

నవతెలంగాణ-కాసిపేట



మండలం లోని కనీస వసతులు లేని మల్కపల్లి గ్రామంలోని ఐకేపీ కేంద్రంలో గురువారం కురిసిన భారీ వర్షానికి మొత్తం వడ్లు తడిసిపోయినా ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని బీజేపీ మండల ఇన్‌ఛార్జి ఆటకపురం రమేష్ విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. ఎకరానికి రూ.20వేల చొప్పున నష్టపరిహారం అందజేయాలని, ప్రతి రైతుకు టార్పాలిన్ అందజేయాలని పేర్కొన్నారు. వడ్లు తొందరగా కొనే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో పడిగేల మహేందర్, బండారి శ్రీనివాస్ , రైతులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత




నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియా గోలేటిలోని జీఎం కార్యాలయం ఆవరణలో జీఎం దేవేందర్ ఆదేశాల మేరకు జూన్ 5వ తేదీన నిర్వహించే ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇందన పొదుపు అంశంపై డీజీఎం(ఐఈడీ) ఉజ్వల్ కుమార్ బెహెర, జూనియర్ ఫారెస్ట్ అసిస్టెంట్ సీఆర్ నవీన్‌కుమార్ ఉద్యోగులకు శుక్రవారం అవగాహన కల్పించారు. వాహనాల వాడకాన్ని సాధ్యమైనంత వరకు తగ్గించి సైకిల్ వాడకంపై వైపు మొగ్గుచూపాలన్నారు. పగటిపూట విద్యుత్ బల్బుల వాడకం బదులుగా కిటికీలు, కర్టెన్‌లు తెరుచుకోవాలన్నారు. ఇందనాన్ని పొదుపు చేస్తే భావి తరాలకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ఉద్యోగులతో ఇందన పొదుపు ప్రతిజ్ఞ చేయించారు.

## కాసిపేట 1ఏ గని ప్రారంభించిన జీఎం



నవతెలంగాణ - కాసిపేట

మందమరి ఏరియా కాసిపేట గని 1ఏ టన్నెల్ ను శుక్రవారం మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ జి.మోహన్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం జి ఎం మాట్లాడుతూ ఈ టన్నెల్ వలన ఉద్యోగులకు దూర భారాన్ని తగ్గించి సరిఐైన సమయంలో రక్షణ కూడిన బొగ్గు ఉత్పత్తిని ఎస్ డిఎల్ యంత్రాల ద్వారా సాధించి సిహెచ్ పి (కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్) కి రోడ్ ట్రాన్స్‌పోర్ట్ ద్వారా రవాణా చేయడం సులభతరం అవుతుందని అన్నారు. ముందుగా 150 హెచ్‌పి సర్ఫేస్ హలర్, పవర్ ట్రిప్లర్ మరియు 1000 కేవీఏ సబ్ స్టేషన్ లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీబీజీకెఎస్ ఉపాధ్యక్షులు మేడిపల్లి సంపత్, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, ఎస్ ఓ టు జి ఎం రాజేశ్వర్ రెడ్డి, కాసిపేట గ్రూపు ఏజెంట్ కుర్మ రాజేందర్,గని మేనేజర్ అల్లావుద్దీన్, ఏరియా రక్షణ అధికారి రవీందర్, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

## 153 గంగపుత్ర సంఘం కుటుంబాలకు ఉపాధి కరువు


- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకొంటున్న గంగపుత్రులు



నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని నంబాల గ్రామంలో గొంటెన్ చెరువులోని చేపలు ఎండతీవ్రత వల్ల, ఊరి నుండి వచ్చే నాలాల మురికి నీరు చెరువులో కలవడం వల్ల సుమారు నాలుగు క్వింటాళ్ల సుమారు రూ.80 వేల చేపలు చనిపోయాయి. ఒక్కో చేప రెండున్నర నుండి మూడు కిలోల వరకు ఉంటుందని గంగపుత్రులు చెపుతున్నారు. ప్రతిరోజు చేపలు పట్టి బతికే మాకు ఇలాంటి అపారనష్టం జరిగినందుకు చాలా బాధపడుతున్నామన్నారు. 153 గంగపుత్ర కుటుంబాలకు 2011 సంవత్సరంలో మాకు గంగపుత్ర సంఘం ఏర్పాటుచేసుకున్నాం. మాకు జీవనాధారం చేపలు పట్టి అమ్ముకొని జీవిస్తున్నాం. ఇలా చేపలు చనిపోవడం వల్ల మాకు ఎటువంటి జీవనాధారం లేకుండా పోయిందని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం. ప్రభుత్వం వెంటనే స్పందించి గంగపుత్ర సంఘాన్ని ఆదుకోవాలని గంగపుత్ర సంఘం అధ్యక్షుడు బక్క భానుప్రసాద్, గంగపుత్ర సంఘం ఉపాధ్యక్షుడు బక్క మల్లేష్, గౌరవధ్యక్షుడు బక్క నాగయ్య కోరుతున్నారు.

## పంచాయతీలను సందర్శించిన ఎంపీడీఓ




నవతెలంగాణ-తాండూర్

మండలంలోని నర్సాపూర్, మాదారం-3 గ్రామ పంచాయతీలను శుక్రవారం ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ సందర్శించారు. పారిశుధ్య పనులను నర్సరీలను పరిశీలించారు. డంపింగ్ యార్డులను పర్యవేక్షించారు. పంచాయతీల్లో క్రమం తప్పకుండా పారిశుధ్య పనులు చేపట్టాలని పంచాయతీ అధికారులకు సూచించారు. స్పెషల్ డ్రైవ్ సందర్భంగా పంచాయతీల్లో పచ్చదనం పరిశుభ్రత స్వచ్ఛభారత్ కార్యక్రమాలు క్రమం తప్పక జరపాలన్నారు. ఆయనతో పంచాయతీ కార్యదర్శి సాదుల్లా ఉన్నారు. వరల్డ్ ఎన్విరాన్మెంట్ డే సందర్భంగా కిష్టంపేట, ద్వారకాపూర్ పంచాయతీల్లో లైఫ్ అవేర్నెస్ ప్రోగ్రాం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ చంద్రమౌళి సురేష్ కుమార్ పాల్గొన్నారు.

# రోడ్డెక్కిన అన్నదాతలు

- వరిధాన్యం కొనుగోలు చేయాలని రాస్తారోకో
- మద్దతు ప్రకటించిన పలు పార్టీల నాయకులు

నవతెలంగాణ - దహెగాం



ఆరుగాలం శ్రమించి పంట పండించిన రైతు తన పంటను కొనుగోలు చేయాలని కోరుతూ రోడ్డెక్కాల్సిన దుస్థితి నెలకొంది. మండలంలోని చౌకా గ్రామంలో వరి కోతలు అయి నెల రోజులు దాటిన వరిధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదంటూ అన్నదాతలు చౌకా ప్రధాన రోడ్డుపై రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ ఎంతో కష్టపడి శ్రమటోడ్చి వరిధాన్యాన్ని పండించి ఆరబెట్టి తూర్పార పట్టి ఉంచిన కేవలం ఒక్క లారీ లోడ్ మాత్రమే కొనుగోలు చేశారని, ఇప్పటివరకు అందరు రైతుల వరిధాన్యం కళ్లాల్లోనే ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్న కొనుగోలు చేయలేదని ఆవేదన చెందుతూ రాస్తారోకో చేపట్టారు. కేవలం 10 నుండి 15 శాతంలోపే తేమ ఉండేలా తూర్పార పట్టినప్పటికీ క్వింటాళ్‌కు మూడు నుండి నాలుగు కిలోలు కటింగ్ చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాల వద్ద అధికారులు వచ్చి చూసి పోవడమే తప్పా కొనుగోలు చేయడంలేదని ఆరోపిస్తున్నారు. రైతుల ధర్నాకు బీజేపీ, కాంగ్రెస్ నాయకులు మద్దతు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతులకు నష్టం కలుగకుండా త్వరగా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఎండను సైతం లెక్కచేయకుండా రైతులు రోడ్డుపై బైఠాయించడంతో రోడ్డుకు రెండు వైపుల భారీగా వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న కాగజ్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కాసం శ్రీనివాస్ సంఘటన స్థలానికి చేరుకొని రైతులతో మాట్లాడి త్వరలోనే అందరి వరిధాన్యాన్ని కొనుగోలు చేస్తామని, ఎవరిని ఇబ్బందిపెట్టమని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు రాపర్తి ధనుంజయ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎలుక మోహన్‌తో పాటు రైతులు పాల్గొన్నారు.

# నకిలీ విత్తనాలు, దేశీదారు నిర్మూలనకు పటిష్ట చర్యలు

- ఆసిఫాబాద్ ఎస్పీ సురేష్ కుమార్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

నకిలీ విత్తనాలు, గుడుంబా, దేశీ దారు లాంటి మత్తు పదార్థాల నిర్మూలనకు జిల్లాలో పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఎస్పీ సురేష్ కుమార్ సూచించారు. రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ, రాష్ట్ర డిజిపి అంజన్ కుమార్ లు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన తర్వాత ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్, ఎక్సైజ్ శాఖ సమన్వయంతో నిషేధిత పదార్థాల నిర్మూలనకు కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో రైల్వేస్టేషన్, బస్టాండ్లు, గ్రామాల్లో రెక్కీ నిర్వహించాలని తెలిపారు. జిల్లాలో రైతులకు ఎవరైనా నకిలీ విత్తనాలను సరఫరా చేసిన, నాసిరకం ఎరువులను, కాలం చెల్లిన ఎరువులు, కాలం చెల్లిన విత్తనాలు విక్రయించిన, సరఫరా చేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని తెలిపారు. రైతులు నష్టపోకుండా వ్యవసాయ శాఖ అధికారులు ధ్రువీకరించిన విత్తనాలను మాత్రమే కొనుగోలు చేయాలని, వ్యాపారస్తుల నుంచి తీసుకున్న బిల్లులు కూడా జాగ్రత్తగా ఉంచుకోవాలని రైతులకు సూచించారు. నకిలీ విత్తనాలను అరికట్టడానికి ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలను నియమించామని తెలిపారు. నకిలీ విత్తన, ఎరువుల దుఖానాలపై దాడులు నిర్వహిస్తామని తెలిపారు. నకిలీ విత్తనాలను పూర్తి స్థాయిలో నిర్మూలించడానికి ప్రత్యేక కార్యాచరణ ఏర్పాటు చేయాలన్నారు. నకిలీ విత్తనాల పట్ల ప్రతి ఒక్క రైతు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. జిల్లాలో ఎవరైనా వ్యాపారస్తులు, సంస్థలు, వ్యక్తులు నకిలీ విత్తనాలు, గుడుంబా, దేశీదారు లాంటి నిషేధిత పదార్థాలు విక్రయిస్తున్నట్లు సమాచారం అందితే స్థానిక పోలీసులకు గాని, స్పెషల్ బ్రాంచ్ 966676866 కు, టాస్క్ ఫోర్స్ ఎస్సై సందీప్ 8712575517 లకు సమాచారం అందించాలని తెలిపారు. మత్తు పదార్థాలను ప్రోత్సహించే వారిని ఉపేక్షించేది లేదని వారు ఏ స్థాయి వారైనా చట్టరీత్య చర్యలు తప్పవని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ అడ్మిన్ అచ్చేశ్వర రావు, ఆసిఫాబాద్ డీఎస్పీ శ్రీనివాస్, కాగజ్ నగర్ డిఎస్పీ కరుణాకర్, టాస్క్ ఫోర్స్ ఇన్స్‌పెక్టర్ సుధాకర్, సిసిఎస్ ఇన్స్‌పెక్టర్ కరీముల్లాఖాన్, డీసీఆర్‌బీ ఇన్స్‌పెక్టర్ పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

నవతెలంగాణ-నస్పూర్




పర్యావరణాన్ని రక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి.సంజీవరెడ్డి అన్నారు. శుక్రవారం వృత్తి శిక్షణా కేంద్రంలో మిషన్ లైఫ్ అవగాహన సదస్సులో భాగంగా ఇంధన శక్తి ఆదా చేయడం గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఆర్కే-7 గనిలో గ్రూప్ ఏజెంట్ మాలోతు రాముడు, గని మేనేజర్ సాయిప్రసాద్, ఆర్కే-5 గనిలో మేనేజర్ అబ్దుల్ ఖాదర్ అవగాహన సదస్సు కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ మే 19 నుంచి జూన్ 5 వరకు శ్రీరాంపూర్ ఏరియాలోని అన్ని గనులు, విభాగాలలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా వివిధ అంశములపై సదస్సునిర్వహించటం అభినందనీయమన్నారు. ప్రపంచ మనుగడ ఇంధన పొదుపుపై ఆధారపడి ఉందని ప్రతి ఒక్కరూ ఇంధనాన్ని పొదుపు చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని, ఇంధనం పొదుపులో భాగంగా సోలార్ విద్యుత్‌ను ఉపయోగించుకోవడం సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేసి వివిధ అవసరాలకు వాడుకోవడం వంటివి చేయాలని భావితరాలకు మనము ఇంధనాన్ని అందించాలంటే పొదుపు చేయడం ముఖ్య అంశమని తెలిపారు. ప్రతి ఒక్కరూ వారి వారి నివాస గహాలలో, పని స్థలాలలో వారి యొక్క పనులు ముగించిన తర్వాత లైట్లు, కూలర్లు, ఫ్యాన్లు నిలిపివేయడం ద్వారా ఇంధనం పొదుపు చేసిన వారం అవుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఉపాధ్యక్షులు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, అధికారుల సంఘం శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్షుడు అబ్దుల్ ఖాదీర్, ఇన్‌ఛార్జి ఎస్ఓ టూ జీఎం గోపాల్ సింగ్, ఏరియా వర్క్ షాప్ డీజీఎం చంద్రశేఖర్‌రెడ్డి, ఏరియా వర్క్ షాప్ ఎస్ఈ సతీష్ చక్రవర్తి, వృత్తి శిక్షణ కేంద్రం ఎస్ఓఎం కల్లూరి వెంకటరామారావు, ఎన్విరాన్మెంటల్ ఆఫీసర్ హనుమాన్‌గౌడ్ పాల్గొన్నారు.

# విద్యార్థినికి అదనపు కలెక్టర్ సన్మానం



నవతెలంగాణ-జన్నారం

ఇటీవల ప్రకటించిన పదవ తరగతి పరీక్ష ఫలితాలలో జిల్లా లోకల్ బాడీ పాఠశాలలన్నింటిలో 10/10 జీపీఏ సాధించిన ఏకైక పాఠశాల కలమడుగు ఉన్నత పాఠశాలలోచదివిన విద్యార్థిని శ్రీరాముల సంహితను కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో అడిషనల్ కలెక్టర్ బి.రాహుల్, డీఈఓ ఎస్.యాదయ్య శుక్రవారం శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాల ఫలితాలు ఉపాధ్యాయ బృందం యొక్క కృషివల్లే సాధ్యమైంని అన్నారు. డీఈఓ ప్రసంగిస్తూ కలమడుగు పాఠశాల విద్యా ప్రగతి జిల్లాలోని అన్ని పాఠశాలలకు ఆదర్శం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారులు సఫ్దర్ అలీఖాన్, సత్యనారాయణమూర్తి, కుమారస్వామి, సైన్స్ అధికారి మధుబాబు, జన్నారం మండల విద్యాధికారి విజయ్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జాడి ప్రభాకర్, ఎన్‌సీసీ అధికారి కట్టా రాజమౌళి పాల్గొన్నారు.

## గురుకుల విద్యార్థి ని సన్మానించిన అడిషనల్ కలెక్టర్



నవతెలంగాణ- తాండూర్

ఇటీవల వెలువడిన ఎస్సెస్సిలో 10 జీపీఏ సాధించిన (సిఓఈ) బెల్లంపల్లి విద్యార్థి కొండగొర్ల సిద్దార్థను మంచిర్యాల జిల్లా అడిషనల్ కలెక్టర్ రాహుల్ ఘనంగా సన్మానించారు. అడిషనల్ కలెక్టర్ స్వయంగా రాసిన ప్రత్యేక ప్రశంసాపత్రం సిద్దార్థకు అందజేసారు. ఈ సందర్భంగా ప్రభుత్వ గురుకులాల్లో ఉత్తమ ఫలితాలు సాధించడమే కాకుండా విద్యార్థులను పలు రంగాల్లో తీర్చిదిద్దుతున్న బెల్లంపల్లి సీఓఈ సిబ్బంది, ప్రిన్సిపాల్ ఐనాల సైదులును అడిషనల్ కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. గురుకులాల్లో జరుగుతున్న ప్రత్యేక ప్రణాళిక, కార్యాచరణ గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ కోట రాజ్‌కుమార్, కోటి చింతల మహేశ్వరరావు, సంక్షేమ గురుకులాల జిల్లా సమన్వయాధికారి రామల బాలభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## మ్యాచింగ్ గ్రాంట్ చెక్కు అందజేత



నవతెలంగాణ- నస్పూర్

ఇటీవల ఎస్ ఆర్ పి 1 గని ప్రమాదంలో మరణించిన బండ రాజలింగు కుటుంబానికి శుక్రవారం శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ సంజీవరెడ్డి మ్యాచింగ్ గ్రాంట్ రూ.10,23,000 చెక్కును, రూ.10 లక్షల ను బాండ్ రూపంలో రాజలింగు సతీమణి భాగ్యలక్ష్మి కి అందజేశారు.ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ మాట్లాడుతూ బండారి రాజలింగు కుటుంబ సభ్యులకు సింగరేణి సంస్థ ఎల్లవేళలా తోడుగా ఉంటుందని, అలాగే వారి కుమారుడైన బండారి శివరామకృష్ణకు సూటబుల్ ఎంప్లాయిమెంట్ (అసిస్టెంట్ ఫోర్ మెన్ ఎలక్ట్రికల్) అతి త్వరలో ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, ఇన్చార్జి ఎస్ఓ టు జిఎం గోపాల్ సింగ్, డీజే పర్సనల్ పి అరవింద రావు, ఎస్ఆర్పి1 గని మేనేజర్ విజయ్ కుమార్, డివై పిఎం లు రాజేశ్వర్ రావు,పాలకుర్తి రాజు తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం తగదు



నవతెలంగాణ-జన్నారం

గ్రామాల్లో పారిశుధ్య పనులపై నిర్లక్ష్యం వహించవద్దని మండల ప్రత్యేక అధికారి డాక్టర్ వై.రమేష్ కుమార్ అన్నారు. భారత విద్యా వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం జన్నారం మండలంలోని కవ్వాల్, దేవునిగూడా, కిష్టాపూర్ గ్రామాల్లో పర్యటించి ఆ గ్రామాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా నిర్వహించాలన్నారు. నర్సరీలలో మొక్కలను సంరక్షించాలన్నారు. సత్య హరిత హారానికి వాటిని సిద్ధం చేయాలని నర్సరీల నిర్వాహకులకు సూచించారు. మల్లె ప్రకృతి వనాల్లో చెట్లను సక్రమంగా పెంచాలన్నారు. వాటికి సక్రమంగా నీరు పోసి, ఎండిపోకుండా చూడాలని సూచించారు. డంపింగ్ యాడ్‌లో తడి చెత్త పొడి చెత్త వేరువేరుగా వేయాలన్నారు. గ్రామాల్లో పనుల నిర్వహణ సక్రమంగా లేకపోతే సర్పంచ్ కార్యదర్శులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అరుణరాణి, ఈఓపీఆర్డీ రమేష్ పాల్గొన్నారు

## సివిల్ డిపార్ట్‌మెంట్ కార్మికుల సమస్య పరిష్కరించాలి

నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి సివిల్ డిపార్ట్‌మెంట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఏరియా జిఎం చర్చల ప్రతినిధి పెట్టం లక్ష్మణ్, వెంగళ కుమారస్వామి సివిల్ డిపార్మెంట్ ఈఈ గుండెరావును కలిసి కార్మికుల సమస్యలను వివరించారు. ప్రధానంగా ఉద్యోగులను తగ్గించి అధిక పని భారం ఉన్న వారి పైన పెంచకూడదని,వేసవి కాలం దృష్ట్యా మంచినీటి సరఫరా విషయంలో అలసత్వం ప్రదర్శించకూడదని తెలిపారు.ఈఈ సానుకూలంగా స్పందించి ఇలాంటి సమస్యలు మళ్లీ రాకుండా చూస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సివిల్ ఫిట్ సెక్రటరీ పెగ మల్లేష్,సివిల్ డిపార్మెంట్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## నామమాత్రపు సేఫ్టీ సమావేశాలు వద్దు

నవతెలంగాణ-నస్పూర్

సింగరేణిలో యాజమాన్యం పేరుకే సేఫ్టీ సమావేశాలు నిర్వహిస్తోందని (సీఐటీయూ) సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ ఏరియా అధ్యక్షుడు మిడివెళ్లి శంకర్, ప్రధాన కార్యదర్శి గోదారి భాగ్యరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుర్తింపు సంఘం కాలపరిమితి ముగిసిన కూడా, యాజమాన్యం అన్ని యూనియన్లతో కాకుండా గుర్తింపు సంఘంగా కొనసాగుతున్న టీబీజీకేఎస్‌తోనే సమావేశాలు నిర్వహించడం సరైందికాదని పేర్కొన్నారు. సేఫ్టీ సమావేశాలు అన్ని యూనియన్లతో చర్చించడం యాజమాన్యానికి ఇష్టం లేకుంటే సీనియర్ కార్మికులతోనే సేఫ్టీ సమావేశాలు నిర్వహించాలని వారు పేర్కొన్నారు. కోల్ కట్టర్ సపోర్టింగ్ టీం లకు పని పరిధిని కాదని ఒక సీము నుండి మరొక సీములో పనిచేయాలని ఒత్తిడి తేవడం, అంతేకాకుండా బోల్టర్ మిషన్ కు, కార్మికులు తాగే నీటికి ఒకే పైప్ లైన్ ద్వారా నీరు ఇవ్వడం వల్ల కార్మికులు అనారోగ్యం పాలవుతున్నారని వివరించారు. ఇప్పటికైనా యాజమాన్యం కార్మిక సమస్యలపై దృష్టి సారించి సేఫ్టీ సమావేశాలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

## పరిసరాల పరిశుభ్రత పాటించాలి

నవతెలంగాణ-లక్ష్మణచాంద



పరిసరాల పరిశుభ్రతను ప్రతీ ఒక్కరూ పాటించాలని జెడ్పీటీసీ ఓస రాజేశ్వర్ అన్నారు. ఫ్రైడే డ్రై డే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని మునిపల్లి గ్రామంలో పర్యటించారు. వీధుల్లో తిరుగుతూ అపరిశుభ్రమైన నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలకు అవగాహనా కల్పించారు. అనంతరం గ్రామంలోని నర్సరీని పరిశీలించారు. వేసవిలో మొక్కలు సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల పట్ల సిబ్బందికి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మోహన్, ఎంపీఓ నసీరుద్దీన్, స్థానిక సర్పంచ్ కమలకోట్ పద్మ వెంకట్‌రెడ్డి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## దంతాల సంరక్షణపై అవగాహన

నవతెలంగాణ-అదిలాబాద్‌టౌన్




ఆదిలాబాద్‌లో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత సమ్మర్ సైన్స్ శిక్షణ శిబిరం కొనసాగుతోంది. అందులో భాగంగానే శుక్రవారం దంత వైద్యులు డాక్టర్ శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ దంతాల సంరక్షణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి పిల్లలకు వివరించారు. 2 లేదా 3 నిముషాల కంటే ఎక్కువ సేపు బ్రష్ వేయవద్దని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాస్, జన విజ్ఞాన వేదిక ప్రధాన కార్యదర్శి నూతుల రవీందర్‌రెడ్డి, కోశాధికారి శ్రీధర్‌బాబు, ఉపాధ్యక్షులు గంగన్న, శ్రీనివాస్, కల్చరల్ కమిటీ కన్వీనర్ మెస్రం రాజు, వినోద్ పాల్గొన్నారు.

# సుందరయ్య పోరాట వారసత్వాన్ని కొనసాగిద్దాం

నవతెలంగాణ-నిర్మల్

సుందరయ్య అందించిన పోరాట వారసత్వాన్ని కొనసాగిద్దామని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దుర్గం నూతన్ కుమార్, కార్యదర్శివర్గ సభ్యులు బొమ్మెన సురేష్ అన్నారు. శుక్రవారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సుందరయ్య 38 వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పేద ప్రజల తరఫున నిరంతరం పోరాడిన ప్రజానాయకుడు, వీర తెలంగాణ పోరాటయోధుడు పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాలను నేటి కాలంలోనూ కొనసాగించాలని అన్నారు. నిజాం నియంతృత్వ, దొరల దౌర్జన్యాల నుండి తెలంగాణ ప్రజలను విముక్తం చేయడానికి సాగిన వీర తెలంగాణ రైతాంగ పోరాటంలో సుందరయ్య కీలక పాత్ర నిర్వహించారని అన్నారు. పార్లమెంటు సభ్యుడిగా ఎన్నికైనా సాదా, సీదా జీవితాన్ని గడిపిన సుందరయ్య పార్లమెంటు భవనానికి సైకిల్‌పైనే వెళ్లే వాడని వారు గుర్తు చేశారు. నెల్లూరు సీమలో పుట్టిన సుందరయ్య తెలంగాణ బిడ్డల పక్షాన పోరాడిన వైనమని అన్నారు. ప్రాంత, కుల, మత విభేదాలు సృష్టించే విచ్ఛిన్నకర శక్తుల అసలు నైజాన్ని ప్రజలు గుర్తించడానికి సహకరిస్తుందని వారు తెలిపారు. దేశంలో సోషలిజం ఉదయించాలని కలలు కన్న మహనీయుడని అన్నారు. సుందరయ్య ఆశయాలను నేటి తరం కొనసాగించాలనిమ అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నిర్మల్ డివిజన్ కమిటీ సభ్యులు ఫసీవుద్దిన్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు లలిత, జిల్లా నాయకులు వెస్లీ, ముత్తన్న, సదానందం గంగాధర్, ప్రేమ్ సింగ్, దశరథ్, గోవర్ధన్ పాల్గొన్నారు.



నిర్మల్‌లో...



ముధోల్‌లో...

**ముధోల్** : సుందరయ్య ఆశయాలతో ముందుకెళతామని సీపీఐ(ఎం) పార్టీ డివిజన్ కమిటీ సభ్యులు గైని మురళి మోహన్ అన్నారు. మండలంలోని కారేగాం గ్రామంలో శుక్రవారం సుందరయ్య 38వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పేద ప్రజల తరపున నిరంతరం పోరాడిన ప్రజానాయకుడు, వీర తెలంగాణ పోరాటయోధుడు పుచ్చలపల్లి సుందరయ్య అని అన్నారు. ఆయన ఆశయాలను నేటి కాలంలోనూ కొనసాగించాలని పేర్కొన్నారు. నిజాం నియంతృత్వము, దొరల దౌర్జన్యాల నుండి తెలంగాణ ప్రజలను విముక్తం చేయడానికి సాగిన వీర తెలంగాణ రైతాంగ పోరాటంలో సుందరయ్య కీలక పాత్ర నిర్వహించారని పేర్కొన్నారు. పార్లమెంటు సభ్యుడిగా ఎన్నికైనా సాదా సీదా జీవితాన్ని గడిపిన సుందరయ్య పార్లమెంటు భవనానికి సైకిల్ పైనే వెళ్లేవారని గుర్తు చేశారు. నెల్లూరు సీమలో పుట్టిన సుందరయ్య తెలంగాణ బిడ్డల పక్షాన పోరాడిన వ్యక్తి అని అన్నారు. ఈ దేశంలో సోషలిజం ఉదయించాలని కలలు కన్న మహనీయుడు సుందరయ్య అని ఆయన ఆశయాలను నేటి తరం కొనసాగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

# బీసీల గుర్చి మాట్లాడే నైతిక హక్కు బీజేపీకి లేదు

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్



బీసీల గురించి మాట్లాడే నైతిక హక్కు బీజేపీ నాయకులకు లేదని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. శుక్రవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో అరవై కోట్ల జనాభా ఉన్న బీసీల సంక్షేమానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేసిందేమీ లేదని ఆరోపించారు. దేశానికి బీసీ ప్రధానిగా ఉండి బీసీలకు చేసిందేంటన్న ఆయన తొమ్మిదేండ్ల పాలనలో 56 శాతం జనాభా ఉన్న బీసీలకు కల్పించిన హక్కులేంటని ప్రశ్నించారు. తెలంగాణ అసెంబ్లీలో బీసీలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని తీర్మానం చేసి పంపినా ఇంతవరకు స్పందించలేదని వాపోయారు. 60 కోట్ల మంది బీసీలు ఉన్న దేశంలో మంత్రిత్వ శాఖ ఎందుకు కేటాయించ లేదని ప్రశ్నించారు. రూ.45 లక్షల కోట్ల కేంద్ర బడ్జెట్‌లో బీసీలకు కేవలం రెండు వేల కోట్ల రూపాయలను మాత్రమే కేటాయించడం దేనికి సంకేతమని అన్నారు. ఆదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం ఆరువేల కోట్ల రూపాయలను కేటాయించిందన్న విషయాన్నీ గుర్తు చేశారు. కర్ణాటకలో ఉచితాలు ఇస్తామని ప్రకటించినా బీజేపీ ఓటమి చవి చూసిందని ఎద్దేవా చేశారు. కేంద్రం పెత్తనం వల్లనే జనాభా ప్రకారం రిజర్వేషన్ కల్పించే వెసులుబాటు దక్కడం లేదని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం క్రిమిలేయర్ తీసుకురావడం వల్ల ఎందరో మంది విద్యార్థులు నష్టపోతున్నారని అన్నారు.

బీజేపీ అంటేనే బీసీ వ్యతిరేక పార్టీ అని అభివర్ణించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బీసీల సంక్షేమానికి వేల కోట్ల రూపాయలను ఖర్చు చేశామని అన్నారు. 294 బీసీ రెసిడెన్షియల్ స్కూల్‌లు ప్రారంభించామని అన్నారు. 261 జూనియర్ కాలేజ్‌లు, 16 డిగ్రీ కళాశాలలను స్థాపించామని అన్నారు. 1,81,880 మంది విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఏడాదికి రూ.880 కోట్ల ఖర్చు చేస్తున్నామని వివరించారు. కేవలం కల్యాణలక్ష్మీ పథకం కింద రూ.1800 కోట్లను ఖర్చు చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మెన్ రౌతు మనోహర్, ఆత్మ చైర్మెన్ జిట్టా రమేష్, ఎంపీపీ గంద్రత్ రమేష్, మార్కెట్ వైస్ చైర్మెన్ బొమ్మ కంటి రమేష్, జంగు పటేల్, నాయకులు సేవ్వా జగదీష్, గంగారెడ్డి, దివిటి రాజు పాల్గొన్నారు.

## ఎన్‌ఎంఎంఎస్‌లో ప్రతిభ చాటిన విద్యార్థులు



**ఆదిలాబాద్‌టౌన్** : 2023-విద్యాసంవత్సరానికి గాను ఎన్‌ఎంఎంఎస్‌లో ఆదిలాబాద్ పట్టణంలోని రణదీవే నగర్ జిల్లా పరిషత్ పాఠశాలకు గాను నాలుగు ర్యాంకులు వచ్చాయి. అందులో ఎస్.నివేదిత, కాంబ్లే ఆదిత్య, తలాండే ఘనశ్యాం, షేక్ రిజ్వాన్ ర్యాంకులు పొందారు. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు భూపతిరెడ్డి విద్యార్థులను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులందరి కృషి ఫలితంగానే ఫలితాలు సాధించామని అన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు కత్తి శ్రీహరి బాబు మాట్లాడుతూ విద్యార్థులను సెప్టెంబర్ మాసం నుండే ప్రత్యేక తరగతులు నిర్వహించి, పరీక్షపై పూర్తి అవగాహన కల్పించి సన్నద్ధం చేయడం జరిగిందని అన్నారు. విద్యార్థులు కూడా కష్టపడి చదవడంతో ఫలితాలను సాధించామని తెలిపారు.

## హామీలు నెరవేర్చడంలో ఎమ్మెల్యే విఫలం

**బేల** : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో స్థానిక ఎమ్మెల్యే పూర్తిగా విఫలమయ్యారని బీజేపీ రాష్ట్ర నాయకురాలు సుహాసినిరెడ్డి ఆరోపించారు. ప్రజా సమస్యలపై పోరాటానికి వస్తున్నా మీ అడపడుచుగా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని పాటన్ గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు గ్రామానికి వచ్చిన ఆమెకు గ్రామస్తులు సాదరంగా స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆదిలాబాద్‌లో అభివృద్ధి కేవలం ప్రకటనలకే పరిమితమైందని అన్నారు. గ్రామాలలో ప్రజలకు కనీస వసతులు లేవని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన గొర్రెల పంపిణీలో భాగంగా లబ్ధిదారుల నుండి డబ్బులు కట్టించుకుని ఇప్పటి వరకు గొర్రెలు పంపిణీ చేయలేదని అన్నారు. వెంటనే పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఆమె వెంట నాయకులు జీవన్‌రెడ్డి, సాదిక్, సాగర్, అంక్లేష్, శ్రీనివాస్, ప్రమోద్, నితిన్, వినోద్, విఠల్, కాంత, భాగ్యలక్ష్మి, అశోక్ రెడ్డి, అశాంత్, దుర్గాచారి ఉన్నారు.

# కెరీర్ గైడెన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-బోథ్

సీపీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఈనెల 25న పొచ్చెర సాయిఫంక్షన్ హాల్‌లో చేపట్టే కెరీర్ గైడెన్స్‌ను మండల విద్యార్థులు, తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని సీఐ కిరణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో కెరీర్ గైడెన్స్‌కు సంబంధించిన వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కెరీర్ గైడెన్స్‌లో పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు. సీపీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ తర్వాత విద్యార్థులు ఎటువైపు వెళ్లాలి అనే విషయాన్ని వివరించడానికి రాష్ట్రంలో ఉన్న నిష్ణాతులైన, పోటీ పరీక్షల నిపుణులు, విద్యావేత్తలు, పలు అకాడమీలకు సంబంధించి సీనియర్ ఫ్యాకల్టీల చేత విద్యార్థుల్లో ఉన్న అనుమానాలు నివృత్తి చేసి వారిని విజయం వైపు అడుగులు వేసేందుకు ఈ కెరీర్ గైడెన్స్ అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్టు సీపీ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు పసులచంటి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్సై కేంద్రే రవీందర్, సీపీ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు చిట్టి సాగర్, కంది ప్రవీణ్, బోథ్ పట్టణ మూడవ ఎంపీటీసీ షేక్ రజియా బేగం నాజర్ అహ్మద్, నాయకులు సల్ల రవి, షేక్ షాకీర్, అనిల్ మాసం, సుమేర్ పాషా, తబ్రేజ్, తాహేర్ పలువురు యువకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# ఉపాధ్యాయుల బదిలీలు వెంటనే చేపట్టాలి



నవతెలంగాణ-ఉట్నూర్

ఉపాధ్యాయుల బదిలీలను ప్రభుత్వం వెంటనే చేపట్టాలని టీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శి రామారావు, గణేశ్ డిమాండ్ చేశారు. శుక్రవారం టీటీఎఫ్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కార్యవర్గ సమావేశం మండలంలోని పెర్కగూడ సమీపంలో ఉన్న జేసీఎన్ గార్డెన్‌లో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా టీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శి రామారావు, గణేశ్ పాల్గొన్నారు. సమావేశంలో ప్రధానంగా జీఓ 3కు చట్టబద్ధత కల్పించాలని అన్నారు. ఉపాధ్యాయుల బదిలీలను ఏజెన్సీ ఉపాధ్యాయులను ఏజెన్సీకి, మైదాన ప్రాంత ఉపాధ్యాయులను మైదాన ప్రాంతానికి గిరిజన సంక్షేమ శాఖలో, జిల్లా పరిషత్‌లో వెంటనే బదిలీలు నిర్వహించాలని అన్నారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులు వెంటనే విడుదల చేయాలని అన్నారు. సీఆర్టీలను రెగ్యులర్ చేసి, ప్రభుత్వ పాఠశాలలో మౌళిక సదుపాయలు కల్పించాలని అన్నారు. పీఈటీ, భాష పండితులను క్రమబద్ధికరించాలని, బద్ధికరణ చేసి సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో టీటీఎఫ్ రాష్ట్ర నాయకులు దినేష్, మంగులాల్, జిల్లా అధ్యక్షుడు రవి, కార్యదర్శి సురేష్, రమేష్, ఉత్తమ్, విశ్వనాథ్, సంతోష్ ధన్‌రాజ్, సదానంద్, శేషరావు ఉన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

నవతెలంగాణ-బోథ్

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సర్పంచ్ సురేందర్ యాదవ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని స్పెషల్ సానిటేషన్ డ్రైవ్‌ను నిర్వహించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. పట్టణంలో ప్రతి ఒక్కరికి పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకోవాలని అలాగే జీవన విధానంపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాల చుట్టూ మురికి నీరు నిల్వ ఉంచుకోకుండా చూసుకోవాలని అలాగే రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని, దోమల బెడద లేకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ జీవన్‌రెడ్డి, ఎస్‌బీఎం కోఆర్డినేటర్ జాదవ్ వసంత్, సెక్రటరీ అంజయ్య మార్కెట్ కమిటీ చైర్మెన్ రుక్మాన్ సింగ్, ఆత్మ చైర్మెన్ మల్లెపూల సుభాష్, గ్రంథాలయ డైరెక్టర్ రమణగౌడ్, మండల ప్రధాన కార్యదర్శి ఎలక రాజు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## పదో తరగతిలో 10 జీపీఏ సాధించిన విద్యార్థినులకు సన్మానం

నవతెలంగాణ-బాసర

మండల కేంద్రానికి చెందిన విద్యార్థినులు ఇటీవల ప్రకటించిన పదో తరగతి ఫలితాల్లో 10జీపీఏ సాధించారు. శుక్రవారం మున్నూరుకాపు సంఘ ఆధ్వర్యంలో సంఘ సభ్యులు విద్యార్థినులను ఘనంగా సన్మానించారు. విద్యార్థినులు నానం నవ్య, గౌరోల్ల నాగవేణి, అస్మితలను శాలువతో సత్కరించి పారితోషకం అందజేశారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు కొర్వా శ్యామ్, నర్సయ్య, శ్రీనివాస్, రామ్ మోహన్ పాల్గొన్నారు.

## వెంకటేశ్వర స్వామికి పాలాభిషేకం



నవతెలంగాణ-నార్నూర్

మండల కేంద్రంలో గుట్టపై నూతనంగా నిర్మించిన బాలాజీ ఆలయంలో శుక్రవారం భక్తులు వెంకటేశ్వర స్వామికి పాలాభిషేకం చేశారు. జిల్లాలోని వివిధ మండలాల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి పూజలు నిర్వహించారు. దర్శనానికి వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం ప్రసాదం ఏర్పాటు చేశారు. పూజ కార్యక్రమంలో ఫ్యాక్స్ ఇన్‌ఛార్జి చైర్మెన్ సురేష్ ఆడే, బాబు, అనిల్ నాయక్, బాలాజీ, దత్తరాం, బిక్కు, భారత్, సూరజ్ సింగ్, ఫాకిరా, డిగాంబర్ ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.

## జాతీయ స్థాయిలో 3వ ర్యాంక్ రావడం సంతోషకరం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

భారత ప్రభుత్వ జలశక్తి మంత్రిత్వ శాఖ ద్వారా నీటి వనరుల సంరక్షణ, నిర్వహణ విభాగంలో జాతీయ నీటి అవార్డులను ప్రకటించడం జరిగింది. అందులో మన ఆదిలాబాద్ జిల్లాకు జాతీయ స్థాయిలో 3వ ర్యాంక్ రావడం చాల సంతోషకరమైన విషయమని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు అహర్నిశలు కృషి చేసి ఉత్తమ పనితీరు కనబరిచిన స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి, అన్ని శాఖల అధికారులను, సిబ్బందిని కలెక్టర్ అభినందించారు. అన్ని శాఖలతో సమన్వయం చేసుకుంటూ, ప్రజలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, మీడియా మిత్రుల సహకారంతో జిల్లాను అన్ని రంగాలలో అగ్ర స్థానంలో నిలుపుతామని పేర్కొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ పట్టణంలో ఈనెల 20న శనివారం ఖానాపూర్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ సదానందం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 09:00 గంటల నుంచి మధ్యాహ్నం 12:00 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని తెలిపారు. దీనివల్ల ఆదిలాబాద్‌లోని ఖానాపూర్, రాణీసతిజీకాలనీ, అశోక్ రోడ్, కోలిపుర, బొక్కలగూడ ఏరియాలలో విద్యుత్తు అంతరాయం ఉంటుందని తెలిపారు. ఈ అంతరాయానికి విద్యుత్ వినియోగదారులందరు సహకరించాలని కోరారు.

**లక్ష్మణచాంద** : మండలంలోని చింతల్‌చాంద సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మత్తు పనులు జరుగుతున్న దృష్ట్యా శనివారం ఉదయం 8 గంటల నుండి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మండల విద్యుత్ శాఖ ఏఈ మహేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

# కేసీఆర్ చిత్రపటానికి వీఆర్‌ఏల పాలాభిషేకం

నవతెలంగాణ-నార్నూర్

సీఎం కేసీఆర్ వీఆర్‌ఏలకు పేస్కెల్‌తో పాటు వారసత్వ ఉద్యోగాలు క్రమబద్ధీకరణ హామీ ఇవ్వడంతో వీఆర్‌ఏలు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. రాష్ట్రంలో 23 వేల మంది వీఆర్‌ఏలు వారి కుటుంబ సభ్యులు సీఎం కేసీఆర్ ప్రభుత్వానికి రుణపడి ఉంటారని పేర్కొన్నారు. పాలాభిషేకం కార్యక్రమంలో రమేష్, బాపురావు, నాగోరావు, రాజన్న, పోషయ్య, రాములు, కవిత, లింగన్న, రాహుల్ ఉన్నారు.

**ఖానాపూర్ రూరల్** : కొన్ని సంవత్సరాల కాలంగా ప్రభుత్వ నిర్ణయం కోసం ఆశతో ఎదురు చూస్తున్న వీఆర్‌ఏలకు తెలంగాణ సీఎం కేసీఆర్ తీపి కబురు చెప్పడంతో వారి ఆనందం అవధులు దాటింది. సీఎం కేసీఆర్ ప్రకటనతో శుక్రవారం వీఆర్‌ఏలు స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. నూతనంగా ఏర్పడ్డ సెక్రటేరియట్‌లో నిర్వహించిన మొదటి సమావేశంలో 111 జీఓను ఎత్తివేయడంతో పాటు వీఆర్‌ఏలను రెగ్యులరైజ్ చేస్తూ పేస్కెల్ వర్తింపజేయనున్నట్లు ప్రకటించడంతో వారు సంబరాలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా వీఆర్‌ఏలు ఒకరికొకరు స్వీట్లు పంచుకుని వారి ఆనందాన్ని పంచుకున్నారు. కేసీఆర్ ప్రకటనతో మండలంలో 65మంది వీఆర్‌ఏలకు లాభం చేకూరనుంది. ఈ కార్యక్రమంలో మండల వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

**సారంగాపూర్** : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ అవరణలో వీఆర్‌ఏలు శుక్రవారం సీఎం కేసీఆర్, మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు వీఆర్‌ఏల సర్దుబాటు, రెగ్యులర్ చేస్తూ, పేస్కేల్, ఇస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించిన సందర్భంగా వీఆర్‌ఏలు దీనిపై హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు వీఆర్‌ఏల సంఘ నాయకులు శేకన్న, గంగాధర్, సాగర్, రాకేష్, అశోక్, సాయన్న, నారాయణ, స్వప్న, విజయ, వినిత, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.



సారంగపూర్‌లో...

**కుభీర్** : తెలంగాణ సీఎం కేసీఆర్ 2020 సెప్టెంబర్ 9న నూతన రెవెన్యూ చట్టం తీసుకువచ్చిన సందర్భంగా వీఆర్‌ఏలకు పేస్కెల్ వారసులకు ఉద్యోగాలు ప్రమోషన్ ఇస్తామని హామీ ఇచ్చి, రెండు సంవత్సరాలు గడిచిన అమలు కాలేదని అన్నారు. దానికి నిరసనగా గత ఏడాది జులై 25న వీఆర్‌ఏలు నిరవధిక సమ్మె చేశామని అన్నారు. దీంతో సమ్మె చేసి 7నెలలు గడిచిన తరువాత నూతన రాష్ట్ర సచివాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఇచ్చిన హామీలను గుర్తు పెట్టుకొని సమావేశం జరిపి ప్రభుత్వం హామీలను ఆమోదం తెలపడంతో శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి వీఆర్‌ఎలు పాలాభిషేకం చేశారు. ఇచ్చిన హామీలను నెరవేర్చినందుకు వీఆర్‌ఎలు తెలంగాణ సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌ఏలు నర్సయ్య, పండరీ, కలిల్ తాయరొద్దీన్ ఉన్నారు.



బోథ్‌లో...

**కడెం** : వీఆర్‌ఏల రెగ్యులరైజేషన్‌పై కెబినేట్ సమావేశంలో ఆమోదం తెలిపినందుకు కడెం మండల వీఆర్‌ఏలు హర్షం వ్యక్తం చేసి, కడెం మండలంలోని తెలుగుతల్లి విగ్రహం వద్ద శుక్రవారం సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌ఏల కడెం మండల అధ్యక్షులు శేక్ ఫిరోజ్, ఉపాధ్యక్షులు జాడి చంద్రమౌళి, గొల్ల కవిత, ప్రధాన కార్యదర్శి కొల్లూరి శ్రీనివాస్, కోశాధికారి మామిడి రమేష్, కడెం మండల వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

**తాంసి** : సీఎం కేసీఆర్ వీఆర్‌ఏలను క్రమబద్ధీకరించడంతో పాటు పేస్కెల్ వర్తింప చేస్తామని గురువారం జరిగిన కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకోవడం పట్ల ఆ నిర్ణయాన్ని హర్షిస్తూ శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట మండల వీఆర్‌ఏలు సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలభిషేకం చేశారు. అనంతరం తహసీల్దార్ శ్రీదేవి, డీటీ విష్ణు జాదవ్, ఆర్ఐ మహేందర్ కార్యాలయ సిబ్బందికి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా వీఆర్‌ఏల మండల అధ్యక్షుడు జీవన్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ మాపై ఉన్న ప్రేమతో మమ్ములను గుర్తించి, క్రమబద్ధీకరించడం సంతోషంగా ఉందని అన్నారు వారికి ఎప్పటికి రుణపడి ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి దారవేణి రాఘవేంద్ర, వీఆర్‌ఏలు స్వాగత్, రాహుల్, నారాయణ ఉన్నారు.

**బోథ్** : మండల కేంద్రంలోని స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో వీఆర్‌ఏ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వీఆర్‌ఎస్ సంఘం అధ్యక్షుడు కట్టే రవీందర్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ రెవెన్యూ సహాయకులు చిరకాల వాంఛ నెరవేర్చినందుకు రుణపడి ఉంటామని అన్నారు. అలాగే ఎన్నో సంవత్సరాల నుంచి ఎదురుచూస్తున్న తమ సమస్యలను పరిష్కరించిన సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. వీఆర్‌ఏల సంఘ సభ్యులు నందయ్య, సాయికుమార్, ముదిరాజ్, ముత్యం, రామచందర్, రాజేశ్వర్, కృష్ణ, శివరాం, అనుజ్ఞ పాల్గొన్నారు.